క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



కామారెడ్డి అర్బన్ : పట్టణ పరిధిలోని దేవునిపల్లి ఆర్యవైశ్య సంఘం వాసవీ ఉద్యానవనంలో భవన నిర్మాణం కోసం శనివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో దేవునిపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చింతగారి బాలయ్య, ప్రధాన కార్యదర్శి నంగునూరు కిరణ్‌కుమార్, ప్రతినిధులు కె.సాయినాథ్, పి.నాగరాజు, పార్శి సంతోష్, గోలి సుధాకర్, తృప్తి శ్రీనివాస్, సంగమేశ్వర్, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దేవి విహార్ ఫేజ్-2 కార్యవర్గం ఏకగ్రీవం



కామారెడ్డి అర్బన్ : పట్టణ పరిధిలోని దేవునిపల్లి దేవివిహార్ ఫేజ్–2 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మంచాల రాజేశ్వర్ యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా వడ్ల భీమయ్య, ఉపాధ్యక్షుడిగా ఆశయ్యగారి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా డొల్లు ప్రదీప్, కోశాధికారిగా బల్ల మహేష్, సంయుక్త కార్యదర్శిగా వడ్ల బస్వయ్యలు ఎన్నికయ్యారు.

మైకు, సౌండ్ సిస్టం వితరణ



పిట్లం(జుక్కల్): గౌరారం గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.7,500 విలువ చేసే మైకు, సౌండ్ సిస్టంను దేశాయిపేట్ గ్రామానికి చెందిన బి.ఎల్లయ్య .. గౌరారం గ్రామ పెద్దలు హనుమంతరావు పటేల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. గౌరారం గ్రామంలో తను ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుంటానని స్కూల్ పక్కనే ఉన్న ఆలయానికి సౌండ్ సిస్టం అందజేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సౌండ్ సిస్టం అందజేసిన ఎల్లయ్యకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ పెద్దలు హనుమంతరావు పటేల్, అంజయ్య, మైసయ్య, హనుమాన్లు, వీర గౌడ్, విట్టల్, లక్ష్మాగౌడ్, రాజు, సత్యం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ. 35 వేల నగదు స్వాధీనం చేసుకొని 9 మందిని అరెస్టు చేశారు. 9 మొబైల్ ఫోన్స్, కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడిన 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పేకాటాడిన వారిలో అధికార పార్టీకి చెందిన వారు ఉన్నట్లు సమాచారం

అన్న ప్రసాద వితరణ



రాజంపేట: మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా ఆలయంలో శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి నెలలో పౌర్ణమి రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పూజారి గౌరీనాథ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు చిన్న సిద్దరాములు, ముత్యపు శ్రీనివాస్, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు


సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ


ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డికి రాఖీ కడుతున్న తన సోదరి సత్యవతి


కేవీఆర్‌కు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు


ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు రాఖీ కడుతున్న కాంగ్రెస్ మహిళా నేతలు


మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు రాఖీ కడుతున్న అక్కలు

అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా తమ సోదరులకు స్వీట్లు తినిపించి రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే సోదరీమణులకు సోదరులు కానుకలు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


రాఖీ కడుతున్న మాజీ ఎమ్మెల్యే అరుణతార


దుర్కిలో అంబేద్కర్ విగ్రహానికి రాఖీ


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డికి రాఖీలు కడుతున్న అక్కా చెల్లెళ్లు


కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆర్డీవో పార్థసింహారెడ్డికి రాఖీ కడుతున్న విద్యార్థినులు


పిట్లంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావుకు రాఖీలు కడుతున్న మహిళలు


తిమ్మాపూర్ వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న పోచారం, పక్కన కాసుల బాల్‌రాజ్


బీబీపేటలో పండుగ జరుపుకుంటున్న కుటుంబం


మద్నూర్‌లో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు


ఆరేపల్లి ఆలయంలో .. హిందూ సంఘం నేతలు


చీనూర్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ..


మాజీ మంత్రి హరీశ్‌రావుతో పెద్దఎడ్గికి చెందిన అరుణబాలునాయక్ కుటుంబ సభ్యులు


ఎల్లారెడ్డి పద్మశాలి సంఘం భవనంలో హోమం చేస్తున్న ఆర్య సమాజ్ సభ్యులు


బాన్సువాడ బస్టాండ్‌లో.. కార్మికులు


ఎల్లారెడ్డి పోస్టాఫీసులో రాహుల్ గాంధీకి రాఖీలను పంపుతున్న గిరిజన మహిళలు


సబ్దల్‌పూర్‌లో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ


బాలసదనంలో.. రోటరీ క్లబ్ ప్రతినిధులు

‘నన్ను గెలిపించడం కామారెడ్డి ప్రజల గొప్పతనం

కామారెడ్డి అర్బన్: నన్ను గెలిపించడం కామారెడ్డి నియోజకవర్గ ప్రజల గొప్పతనమని, ప్రతి ఒక్కరు సమాజాభివృద్ధికి కృషి చేస్తే అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కామారెడ్డిలోని శ్రీత్రిశక్తి ఆలయం, శ్రీమార్కండేయ ఆలయం, శ్రీశారదా మాతా ఆలయాల్లో పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనం, సన్మానాలు పొందారు. ఈ సందర్భంగా శ్రీత్రిశక్తి ఆలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బ్రాహ్మణ వికాస పరిషత్ అధ్యక్షుడు చేపూరి అర్జున్‌రావు, వేదపండితులు అంజనేయశర్మ, సుధాకరశర్మ, రాంమోహన్, మధుసూదన్‌రావు, పద్మశాలి సంఘం నాయకులు రాజేశ్వర్, కృష్ణహరి, షేర్ల రాములు, నాగభూషణం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీత్రిశక్తి ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

దోమకొండ: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఆమోదింపజేయాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. గతంలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేశారని, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా బీసీ డిక్లరేషన్ విషయం ఎన్నికల సమయంలో చెప్పి ఇచ్చిన మాట నిలుపుకున్నారన్నారు. పార్లమెంట్‌లో ఎంపీలు ఆమోదించి ప్రజల కోరిక తీర్చాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నేతలు అబ్రబోయిన స్వామి, సీతారాం మధు, నల్లపు శ్రీనివాస్, షమ్మీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రోడ్డుపైకి మురుగు నీరు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీ సాయిబాబా ఆలయం ముందు చౌరస్తాలో మురుగు నీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. చిన్నపాటి వర్షానికే అక్కడి మురికి కాలువలు నిండుకుని రోడ్డుపైకి మురుగు వస్తోంది. దుర్గంధంతో స్థానికులు, ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కురిసిందంటే రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బీమా పథకానికి సంబంధించి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని నాగిరెడ్డిపేట మండల వ్యవసాయాధికారి(ఏవో) సాయికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ 5 లోపు కొత్తగా పట్టాపాసుపుస్తకం వచ్చిన రైతులు 2025–26 రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీంతోపాటు ఇదివరకు రైతుబీమాలో పేర్లు నమోదు చేసుకున్న 18–59 ఏళ్ల లోపు రైతులు వారి నామినీ పేరును మార్చుకోవాలనుకుంటే వారు కూడా దరఖాస్తులను సంబంధిత ఏఈవోలకు అందజేయాలని తెలిపారు. ఈ నెల 13లోపు దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు.

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రాక

ఎల్లారెడ్డిరూరల్: నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలో ఆదివారం నిర్వహించే తీజ్ పండుగ వేడుకలలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బంజారా సంఘం, కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

పట్టు తప్పితే అంతే సంగతి!

మద్నూర్(జుక్కల్): మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రయివేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాహనాల డ్రైవర్లు మోతాదుకు మించి ప్రయాణికులను ప్రమాదకరంగా తరలిస్తున్నారు. మండల కేంద్రంలో శనివారం పెద్ద శక్కర్గా నుంచి మద్నూర్‌కు వచ్చిన ఆటో టాప్‌పై ప్రయాణికులు ప్రమాదకరంగా కూర్చొని వచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు స్పందించి ప్రమాదకర ప్రయాణాలు సాగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మద్నూర్‌లో ఆటోపైన ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రజలు

చినుకు పడితే చిత్తడే

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలోని బీసీ కాలనీలో రోడ్డు బురదమయంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిస్తేచాలు చిత్తడిగా మారుతోంది. శుక్ర, శనివారాలు వర్షం కురియడంతో ఈకాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 10 సంవత్సరాల క్రితం ఈ కాలనీలో ఇళ్లు కట్టుకోగా.. మట్టిరోడ్డు వేయించారు. ఎన్ని సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఈ రోడ్డును సీసీగా లేదంటే బీటీగా మార్చాలని కోరుతున్నారు.


కృష్ణాజీవాడిలోని బీసీ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు

కొమురం భీమ్ ఆశయాలను సాధించాలి


హన్మాజీపేట్‌లో నివాళులర్పిస్తున్న ఆదివాసి నాయక్‌పోడ్ కులస్తులు


మెంగారంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయక్ పోడు కులస్తులు


బూర్గుల్‌లో జెండావిష్కరణ చేసిన ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం నాయకులు

బాన్సువాడ రూరల్: జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాటం సాధించి అమరుడైన కొమురం భీమ్ ఆశయాలు సాధించాలని నాయక్‌పోడ్ సంఘం కామారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొంకి గణేష్ అన్నారు. శనివారం ఆదివాసి నాయక్‌పోడ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని కొమురం భీమ్ విగ్రహానికి నివాళి అర్పించారు. నేతలు వెంకటి గణేష్, పోచయ్య, లింగం, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా నాయక్‌పోడు సంఘం ఆధ్వర్యంలో మెంగారంలో నాయక్‌పోడు కులస్తులు శనివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదివాసి నాయక్ పోడు కులస్తులకు ప్రభుత్వం అండగా ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంఘం అధ్యక్షుడు పుట్ట దత్తు, నాయకులు రాములు, బాలసాయిలు, కొత్తపల్లి రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్ మండలం బూర్గుల్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్‌లో శనివారం ప్రపంచ ఆదివాసి నాయక్ పోడ్ ఘనంగా నిర్వహించారు. ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆదివాసి నాయక్‌పోడ్ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని చెప్పారు. నాయకులు భూమయ్య, మన్నె సాయిలు, సంతోష్, అంజయ్య, పోషయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

శనేశ్వరుడికి పౌర్ణమి విశేష తైలాభిషేకం



కామారెడ్డి అర్బన్: శ్రావణ పౌర్ణమి శనివారం సందర్భంగా వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శనిశింగనపురం శ్రీశనేశ్వర స్వామికి నువ్వుల తైలంతో విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు లింగాగౌడ్, రవీందర్‌రెడ్డి, యాద అనిల్‌కుమార్, దేవాచారి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తి, శ్రద్ధలతో పాటలు పాడుతూ స్వామి ఆలయం చుట్టూ తిరుగుతూ పల్లకీ సేవను నిర్వహించారు.

ఘనంగా జంధ్యాల పూర్ణిమ



రామారెడ్డి: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో జంధ్యాల పూర్ణిమను పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. నీకు నేను రక్ష నాకు నీవు రక్ష అనే స్తోత్రం పాటిస్తూ అందరూ ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకున్నారు. సంఘం అధ్యక్షుడు దోమల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సుప్పని రవి, కోశాధికారి భూపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల పూర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరి ఆశ్రమం ఆవరణలో గల మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహించారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: రాఖీ పండగ సందర్భంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో యజ్ఞోపవేతధారణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్వాడీ గల్లీలోని భక్త మార్కెండేయ ఆలయంలో శనివారం పద్మశాలి కులసంఘం ఆధ్వర్యంలో గాయత్రీధారణ(జంధ్యము) కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రాఖీ పౌర్ణిమ రోజున పాత జంధ్యము తీసివేసి కొత్త జంధ్యము వేసుకోవడం సంప్రదాయమని పద్మశాలీలు అన్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుషాల్, సందీప్, కార్యదర్శి నాగేశ్, రాష్ట్రా సహాయ కార్యదర్శి రమణ, పెంటేష్, సురేష్ తదితరులున్నారు.

సంతోషిమాత జయంతి వేడుకలు



బాన్సువాడ: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న సంతోషిమాత ఆలయంలో జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సంతోషిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. నామకరణం, డోలాహరణ, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కోటి దత్తాత్రి, సంతోష్, శంకర్, మల్లికార్జున్ రాజు, అశోక్‌రావు తదితరులున్నారు.

శ్రీకృష్ణాష్టమి కరపత్రాల ఆవిష్కరణ

శ్రీకృష్ణ జన్మాష్టమికి సంబంధించిన కరపత్రాలను ఇస్కాన్ సత్సంగ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. నేటి నుంచి 17 వరకు కామారెడ్డి ఇస్కాన్ సత్సంగ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు ప్రభు, వినయ్, మల్లికార్జున్‌లు తెలిపారు.

శివపార్వతుల కల్యాణం



దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో శనివారం నూలు పున్నమి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, భక్తులు పాల్గొన్నారు.